

మాణెక్ షా పరేడ్‌మైదానంలో గణతంత్ర వేడుకల్లో గవర్నర్

గ్యారెంటీలతో కోట్లాది మందికి చేయూత

- రాజ్యాంగ ఆశయాలు సఫలీకృతమయ్యేలా సేవలు
- కరువు రైతులకు బాసటగా నిలుస్తాం
- బ్రాండ్ బెంగళూరుకు సలహాలు సంతోషదాయకం
- విద్యాసంస్థల్లో భారత రాజ్యాంగంపై అవగాహన
- గణతంత్ర వేడుకల్లో గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్



గౌరవ వందనం స్వీకరిస్తున్న గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్



పరేడ్ వేడుకలను వీక్షిస్తున్న గవర్నర్, సీఎం సిద్దరామయ్య తదితరులు



సాహస ప్రదర్శన



అక్షరమాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

బెంగళూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): గ్యారెంటీలతో కోట్లాది మందికి సౌలభ్యాలు సమకూరుతున్నాయని, ఇది పేదవర్గాల అభ్యున్నతికి చేయూతగా నిలుస్తోందని గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్ పేర్కొన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని మాణెక్ షా పరేడ్ మైదానంలో జాతీయ పతాకాన్ని గవర్నర్ ఆవిష్కరించారు. అంతకు ముందు రాజ్‌భవన్ నుంచి భారీ భద్రత, అశ్వదళాల మధ్య మైదానానికి చేరుకున్న గవర్నర్ త్రివిధ దళాలు, పోలీసు బృందాల, సాంస్కృతిక బృందాలు, విద్యార్థులను ఓపెన్‌టాప్ జీప్ ద్వారా పర్యవేక్షించారు. తర్వాత వేదిక నుంచి గవర్నర్ ప్రసంగిస్తూ ఇదో చారిత్రాత్మక దినమని అన్నారు. రాజ్యాంగం ద్వారా దేశ ప్రజలందరికీ న్యాయం, స్వాతంత్ర్యం, సమానత, అవకాశాలను సమకూర్చడంతో పాటు దేశ సమగ్రత, ఐక్యత, ఆత్మాభిమాన జీవనం కల్పించడమే ధ్యేయంగా ఉందన్నారు. ఐదు గ్యారెంటీలను అమలు చేస్తామని ప్రజలకు ఇచ్చిన హామీలకు అనుగుణంగా ప్రభుత్వం అమలు చేసిందని, తద్వారా కోట్లాది మందికి సౌలభ్యాలు సమకూరుతున్నాయని తెలిపారు. శక్తి యోజనె ద్వారా విద్యార్థులు మహిళలతో కలిపి 3.5 కోట్ల మంది లబ్ధి పొందుతున్నారని, ఇప్పటి వరకు 134.34 కోట్ల మంది శక్తి గ్యారెంటీ సౌలభ్యం పొందారని తెలిపారు. అన్నభాగ్య ద్వారా ఐదు కిలోల బియ్యానికి బదులు నవంబరు ఆఖరు దాకా రూ.2,900కోట్లు నగదు బదిలీ అయిందన్నారు. గృహజ్యోతి ద్వారా 1.50 కోట్ల మంది లబ్ధి పొందుతున్నారని చెప్పారు. గృహలక్ష్మి ద్వారా 1.17 కోట్ల మంది మహిళలకు నెలవారీ రూ.2వేలు చెల్లిస్తున్నామని తెలిపారు. యువనిధి గ్యారెంటీని ఇటీవలే ప్రారంభించామని పేర్కొన్నారు. రాష్ట్రంలో తీవ్రమైన కరువు నెలకొందని 236 తాలూకాలపైకి 223 తాలూకాల్లో ప్రభావం ఉండగా 196 తాలూకాల్లో తీవ్ర పరిస్థితి నెలకొందన్నారు. కరువు పరిస్థితులను అధిగమించేందుకు ప్రతి రైతుకు రూ. 2వేలు ఇన్‌పుట్ సబ్సిడీని అందిస్తున్నామని, 30 లక్షల మంది రైతులకు రూ.580 కోట్లు విడుదల చేశామని తెలిపారు. తాలూకా స్థాయిలో తాగునీరు, పశుగ్రాసం కొరత నివారించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. పంటల సర్వే, రైతు సిరి, కర్ణాటక రైతు సురక్షా ప్రధానమంత్రి పంటలబీమా, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాలను అమలు చేస్తున్నామని వివరించారు. జలజీవన్ మిషన్ ద్వారా రాష్ట్రంలోని 72.38 లక్షల కుటుంబాలకు తాగునీరు అందుతోందన్నారు. 35లక్షల మంది రైతులకు రూ.25వేల కోట్ల పంట రుణాలు అందించడం లక్ష్యం కాగా 17.24 లక్షలమంది రైతులకు రూ.13,672 కోట్లు సాధ్యమైందన్నారు. రాష్ట్రాన్ని అనీమియా రహితంగా తీర్చేందుకు పౌష్టికాహారం అందించేందుకు రూ.185.74 కోట్లతో శక్తిని సమకూర్చే అహారాన్ని అందిస్తున్నామని వెల్లడించారు. జయదేవ హృద్రోగ సంస్థ ద్వారా 15 జిల్లాల్లో ఏప్రిల్ నుంచి నవంబరు దాకా 80వేల మందికి ఈసీజీ పరీక్షలు 1084 మందికి శస్త్ర చికిత్సలు నిర్వహించామన్నారు. పునీత్‌రాజ్‌కుమార్ హృదయజ్యోతి పథకం అమలు చేస్తున్నామని, రాష్ట్ర వ్యాప్తంగా 168 డయాలసిస్ కేంద్రాలు పనిచేస్తున్నాయని, 108 ఆరోగ్యసురక్ష పథకం కింద అంబులెన్స్ సేవలందిస్తున్నామని వెల్లడించారు. బెంగళూరు నగరాన్ని ప్రపంచ స్థాయిలో తీర్చేందుకు బ్రాండ్ బెంగళూరు పేరిట 8 అంశాలపై ప్రజల నుంచి అభిప్రాయ సేకరణకు సిద్ధం కాగా 70వేలకు పైగా సలహాలు, సిఫారసులు రావడం సంతోషదాయకమన్నారు. బెంగళూరులో ప్రధానమైన ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు పలు సలహాలు వచ్చాయన్నారు. రాష్ట్రంలోని అన్ని విద్యాసంస్థల్లో రాజ్యాంగ పీఠిక, ఫొటోను ప్రదర్శించాలని, ప్రతిరోజూ ప్రార్థనవేళ రాజ్యాంగ అంశాలను వివరించేందుకు నిర్ణయం తీసుకున్నామని వివరించారు. స్టేట్ ఫైనాన్స్ కమిషన్ ద్వారా మైనారిటీ పారిశ్రామిక వేత్తలకు 6శాతం వడ్డీతో రూ.10కోట్ల దాకా రుణం అందిస్తున్నామన్నారు. దివ్యాంగులకు 54.40కోట్లతో సౌలభ్యాలు అందిస్తున్నామన్నారు. కర్ణాటక పేరు ఏర్పడి 50 ఏళ్లు పూర్తైన సందర్భంగా 'కర్ణాటక సంభ్రమ 50'ను ఏడాది పొడవునా నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర స్థాయిలో సింగిల్‌విండో ద్వారా పెట్టుబడులను ఆహ్వానిస్తున్నామని, దేశ సాఫ్ట్‌వేర్ ఎగుమతులలో 42 శాతం కర్ణాటక నుంచే సాధ్యమవుతోందన్నారు. బెంగళూరు టెక్ సమ్మిట్ 26వ విడత బ్రేకింగ్ బౌండరీస్ సదస్సుకు 40 దేశాలు భాగస్వామ్యం అయ్యాయన్నారు. ఏషియన్ గేమ్స్‌లో రాష్ట్రంలో నుంచి క్రీడాకారులు పతకాలు సాధించడం గర్వకారణమన్నారు. మేకెదాటు, కృష్ణ ఎగువ ప్రాజెక్టులు త్వరితగతిన పూర్తి చేసేదిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని కొనియాడారు. రాజ్యాంగ ఆశయాలను అమలు చేసే దిశగా ప్రతి ఒక్కరూ పనిచేద్దామని రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు.

పరేడ్ వేడుకల్లో ముఖ్యమంత్రి

మాణెక్ షా పరేడ్ మైదానంలో జరిగిన గణతంత్ర వేడుకల్లో ముఖ్యమంత్రి సిద్దరామయ్య పాల్గొన్నారు. గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్‌తో పాటు సాంస్కృతిక ప్రదర్శనలు తిలకించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రజనీశ్ గోయెల్, డీజీపీ అలోక్ మోహన్, అదనపు ముఖ్యకార్యదర్శి శాలిని రజనీశ్ సహా ముఖ్య అధికారులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

నగరంలోని మాణెక్ షా పరేడ్ మైదానంలో గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని సాగిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పలు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ప్రత్యేకించి విద్య ఆవశ్యకతను చాటే ప్రదర్శనలు సాగాయి.



215 అడుగుల ఎత్తులో పతాకావిష్కరణ

విజయనగర, జనవరి 26: జాతీయ పతాకాన్ని ప్రతి ఒక్కరూ తప్పక గౌరవించాలని గోవిందరాజనగర ఎమ్మెల్యే ప్రియాకృష్ణ పేర్కొన్నారు. చంద్రా లే అవుట్‌లో 215 అడుగుల ఎత్తైన స్తంభంపై జాతీయ పతాకాన్ని హైకోర్టు రిటైర్డు న్యాయమూర్తి నాగమోహన్‌దాస్ శుక్రవారం ఎగురవేశారు. దీంతో ఈ ప్రదేశం ప్రముఖ కూడలిగా గుర్తింపు పొందనుంది. ఎమ్మెల్యే ఎం. కృష్ణప్ప స్థానిక నాయకులు పాల్గొన్నారు.

చంద్రా లే అవుట్‌లో రెపరెపలాడుతున్న త్రివర్ణ పతాకం



ఊరేగింపును ప్రారంభిస్తున్న మంత్రి సుధాకర్

చింతామణిలో 2,220 పొడవైన జాతీయజెండా

చింతామణి, జనవరి 26: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని చింతామణి ఆర్యవైశ్యమండలి ఆధ్వర్యంలో 2,200 అడుగుల పొడవైన జాతీయ జెండాను జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్ ప్రారంభించారు. శుక్రవారం చింతామణిలోని కేఎస్ఆర్టీసీ డిపో వద్ద వరసిద్ధి వినాయక దేవస్థానంలో తొలుత పూజలు నిర్వహించారు. అనంతరం జాతీయ పతాకాన్ని మంత్రి సహా నగరసభ కమిషనర్ జీఎన్ చలపతి, బీఈఓ ఉమాదేవి, ప్రభుత్వ బాలుర కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుగుణ, ఆర్యవైశ్యమండలి అధ్యక్షుడు వీడీహెచ్ అశ్వథనారాయణ జాతీయ పతాక ఊరేగింపును ప్రారంభించారు. శ్రీసత్యసాయి జిల్లా రొద్దంకు చెందిన సహారా కేడెట్ సొసైటీకి చెందిన లక్ష్మీనారాయణ గుప్త ఈ పతాకాన్ని రూపొందించారు. విద్యార్థుల్లో జాతీయభావాన్ని పెంపొందించడమే కార్యక్రమ ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యమండలి సభ్యులు, మహిళలు, విద్యార్థులు, స్థానికులు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



పురవీధుల్లో జాతీయ పతాకం ఊరేగింపు ఇలా...

ఎమ్మెల్యేలకు కార్పొరేషన్లు, బోర్డులు

- చైర్మన్‌లుగా 34 మందికి పదవులు

బెంగళూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): బోర్డులు, కార్పొరేషన్ చైర్మన్ పదవుల జాబితా విడుదలైంది. మూడు నెలలుగా మలుపులు తిరిగిన జాబితాకు ఎట్టకేలకు శుక్రవారం ఆమోదం లభించింది. 34 మంది ఎమ్మెల్యేలకు కార్పొరేషన్ చైర్మన్ హోదాలు కల్పిస్తూ ముఖ్యమంత్రి సూచనతో ప్రభుత్వ అదనపు కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. గవర్నర్ ఆదేశాలకు అనుగుణంగా జాబితాను ఖరారు చేసినట్టు ప్రకటించారు.

నియోజకవర్గం	ఎమ్మెల్యే	చైర్మన్ హోదా
సింధనూరు	హంపనగౌడ బాదర్లి	రాష్ట్ర చేతివృత్తులు, మౌలిక సదుపాయాలు
ముద్దేబిహాళ్	అప్పాజి సీఎస్ నాడగౌడ	సోప్స్ అండ్ డిటెర్జెంట్స్
కాగవాడ	బరమగౌడ (రాజీవ్)	వాయువ్య రవాణా సంస్థ
బాగల్కోటె	హెచ్‌వై మేటి	బాగల్కోటె నగరాభివృద్ధి ప్రాధికార
గుబ్బి	ఎస్ఆర్ శ్రీనివాస్	కేఎస్ఆర్టీసీ
బ్యాడగి	బసవరాజ్ నీలప్ప శివణ్ణవర్	రాష్ట్ర అటవీ అభివృద్ధి మండలి
హొసదుర్గ	బీజీ గోవిందప్ప	పౌర, ఆహార సరఫరాలు
మాగడి	హెచ్‌సీ బాలకృష్ణ	రాష్ట్ర రోడ్డు అభివృద్ధి మండలి
రోణ	జీఎస్ పాటిల్	ఖనిజ అభివృద్ధి మండలి
శాంతినగర్	ఎన్ఏ హ్యారిస్	బెంగళూరు అభివృద్ధి ప్రాధికార
బైలహొంగల	కౌజలగి మహంతేశ్	ఫైనాన్స్ కార్పొరేషన్
చామరాజనగర	పుట్టరంగశెట్టి	మైసూరు సేల్స్ ఇంటర్నేషనల్ లిమిటెడ్
బీళగి	జీటీ పాటిల్	హట్టి గోల్డ్ మైన్స్
శోరాపుర	రాజా వెంకటప్పనాయక్	శీతలగిడ్డంగులు
భద్రావతి	సంగమేశ్వర్	గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి
అరసికెరె	శివలింగేగౌడ	గృహమండలి
హుబ్బళ్ళి-ధార్వాడ తూర్పు	అబ్బయ్య ప్రసాద్	మురికివాడల అభివృద్ధి
బంగారపేట	నారాయణస్వామి	నగర మౌలిక సదుపాయాలు, ఆర్థిక అభివృద్ధి
చెళ్ళకెరె	రఘుమూర్తి	చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధి
శ్రీరంగపట్టణ	రమేశ్ బండి సిద్దేగౌడ	చాముండేశ్వరి విద్యుత్ సరఫరా
ఆనేకల్	శివణ్ణ	బీఎంటీసీ
బాగేపల్లి	సుబ్బారెడ్డి	సీడ్స్ డెవలెప్‌మెంట్ కార్పొరేషన్
ధారవాడ	వినయ్ కులకర్ణి	జలమండలి
హెచ్‌డీ కోట	అనిల్ చిక్కమాదు	జంగిల్ లాడ్జెస్
రాయచూరు గ్రామీణ	బసవనగౌడ	ఎస్టీ కార్పొరేషన్
కలబురగి ఉత్తర	ఖనీజా ఫాతిమా	పట్టు పరిశ్రమ
హునగుంద	విజయానంద కాశప్ప	క్రీడాభివృద్ధి ప్రాధికార
శృంగేరి	రాజీవ్‌గౌడ	రెన్యూవబుల్ ఎనర్జీ
కేజీఎఫ్	రూపకళ	హస్తకళల అభివృద్ధి
కారవార	సతీశ్ కృష్ణశైల్	మార్కెటింగ్ కన్సల్టెన్సీ ఏజెన్సీ
హొస్కోటె	శరత్ బచ్చేగౌడ	కియోనిక్స్
కంప్లి	గణేశ్	హ్యాండ్‌లూమ్స్ డెవలెప్‌మెంట్
మస్కి	బసవనగౌడ తుర్విహాల్	ఖాదీ గ్రామోద్యోగ్

రాష్ట్రీయ రక్షా విశ్వవిద్యాలయంలో ఘనంగా గణతంత్ర దినోత్సవం

బెంగళూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): శివమొగ్గ రాగిగుడ్డలోని రాష్ట్రీయ రక్షా యూనివర్సిటీ క్యాంపస్‌లో శుక్రవారం 75వ గణతంత్ర దిన వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. అమృత మహోత్సవ వేళ జరిగిన ఈ వేడుకలకు కువెంపు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్ఎం గోపీనాథ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ 75 ఏళ్ల గణతంత్ర మజిలీ నేడు ప్రపంచం అబ్బురపడేస్థాయికి చేరుకుందన్నారు. చంద్రుడి దక్షిణ ధ్రువంపై చంద్రయాన్ విజయవంతం కావడం, ప్రపంచంలోనే భారత్ ఐదో అతిపెద్ద ఆర్థికశక్తిగా ఉండడం వంటి అంశాలను ప్రస్తావించారు. పరిపూర్ణ రాజ్యాంగంతో భారత ప్రజాస్వామ్యం అద్భుతంగా పరిఢవిల్లుతోందన్నారు. ఈ సందర్భంగా గోపీనాథ్‌ను ఆత్మీయంగా సత్కరించారు. అంతకుముందు క్యాంపస్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. రాష్ట్రీయ రక్షా విశ్వవిద్యాలయ ప్రగతిని క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ రమానంద్ గార్గ్ వివరించారు. లెఫ్టినెంట్ జగదీశ్ లేపాక్షి, రిటైర్డు కెప్టెన్ కేటీ విజయ, పి. ధనరాజ్, సవితా మాధవ్, మేఘనాథరెడ్డి తదితరులను ఘనంగా సత్కరించారు.



ప్రొఫెసర్ ఎస్ఎం గోపీనాథ్‌ను సన్మానిస్తున్న క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ గార్గ్

బలిష్ట ఆర్థిక భారతావనిని ఆవిష్కరిద్దాం



కెనరాబ్యాంకు ప్రధాన కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎండీ, సీఈఓ కె. సత్యనారాయణ రాజు

- కెనరాబ్యాంకు ఎండీ, సీఈఓ కె. సత్యనారాయణ రాజు


బెంగళూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): బలిష్ట ఆర్థిక భారతావనిని ఆవిష్కరించే దిశలో దేశంలోని ప్రజలందరూ ప్రతినబూనాలని కెనరాబ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ కె. సత్యనారాయణ రాజు పిలుపునిచ్చారు. బెంగళూరులోని బ్యాంకు ప్రధాన కార్యాలయంలో శుక్రవారం గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన ప్రసంగిస్తూ రానున్న ఐదేళ్లలో ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థికశక్తిగా భారతదేశం ఎదగనుందని తెలిపారు. సౌర విద్యుత్ వాడకం మరింతగా పెరగాలని, దేశంలోని కోటి ఇళ్లపై సౌర ఫలకాలు ఏర్పాటు కావాలన్న ప్రధాని ఆకాంక్షను సాకారం చేసేందుకు కెనరాబ్యాంకు సిబ్బంది ముందుకు రావాలని పిలుపునిచ్చారు. స్వచ్ఛభారత్ ఆవశ్యకతను ఆయన వివరించారు. సామాజిక సేవా కార్యక్రమాల కోసం బ్యాంకు గత ఏడాది రూ.39 కోట్లు కేటాయించిందని, ఇందులో ఇప్పటికే రూ.34కోట్లు ఖర్చు చేశామన్నారు. ప్రత్యేకించి ఔత్సాహిక క్రీడాకారులను వెన్నుతట్టి ప్రోత్సహించేందుకు రూ.7కోట్లు ఖర్చు చేశామని వివరించారు.

ప్రత్యేక ఆకర్షణగా దేవరకొండ ఉమాదేవి

కెనరాబ్యాంకులో జరిగిన గణతంత్ర ఉత్సవాల వేదికపై ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లాకు చెందిన రెజ్లింగ్ క్రీడాకారిణి దేవరకొండ ఉమాదేవి ప్రధాన ఆకర్షణగా నిలిచారు. కెనరా బ్యాంకు అందించిన ప్రోత్సాహంతో అంతర్జాతీయ స్థాయిలో అద్భుతంగా రాణించి వెండి పతకాన్ని సాధించిన ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. క్రీడాకారిణి ఉమాదేవితోపాటు ఆమె తండ్రి నారాయణస్వామిని వేదికపైకి ఆహ్వానించి సన్మానించారు. ఉమాదేవి తన కలను సాకారం చేసుకునేందుకు మరిన్ని లక్ష్యాలను అందుకునేందుకు కెనరాబ్యాంకు బాసటగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బ్యాంకు ఉన్నతాధికారు, సిబ్బంది పాల్గొన్నారు.



మాస్కోలో తాను గెలిచిన వెండి పతకాన్ని ఎండీకి చూపుతున్న క్రీడాకారిణి దేవరకొండ ఉమాదేవి



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1588.68	1,618.19
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	539	8,173
సామర్థ్యం (టీఎంసీలు)	9.97	56.40

జీన్స్‌ప్యాంటుతో వచ్చిన మహిళలకు శాలువాతో సత్కారం

సంప్రదాయాన్ని కాపాడాలని మంత్రి సూచన



యువతికి శాలువా కప్పి సత్కరిస్తున్న ఎమ్మెల్యే గవప్ప

కంప్లి, హొసపేట జనవరి 26 : గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని హంపిలో శుక్రవారం విరుపాక్షేశ్వరస్వామిని దర్శించుకునేందుకు జీన్స్ ప్యాంటు, చుడీదార్లో వస్తున్న మహిళలకు ఎమ్మెల్యే గవప్ప జిల్లా అధికారి కేఎస్ దివాకర్ శాలువాలు కప్పి సత్కరించారు. దేశ సాంప్రదాయాల ప్రకారం మహిళలు చీర, పురుషులు పంచె కట్టుతో దైవాన్ని దర్శించుకోవాలన్నారు. దేశ సంప్రదాయాలను మనమే కాపాడుకోవాలని, అప్పుడే రానున్న యువతరానికి తాము గుర్తుండిపోతామన్నారు. కార్యక్రమంలో కమీషనర్ మహమ్మద్ అలీ, అక్రమ్, దేవాదాయ శాఖ అధికారి హనుమంతప్ప, వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులు, పంచాయతీ అధికారులు, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీ తాయమ్మదేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో శ్రీ తాయమ్మదేవి

సిరుగుప్ప, జనవరి 26: పట్టణంలోని ఆదోని మార్గంలో వెలసిన శ్రీ తాయమ్మదేవికి శుక్రవారం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి భక్తులు ఆకుపూజ, పుష్పాలంకార సేవ జరిపి నిమ్మకాయలహారం సమర్పించారు. అర్చకులు ప్రవీణ్ పూజలు జరిపి ప్రసాద పంపిణీ చేపట్టారు.

పంటలకు మద్దతు ధర ప్రకటించాలి



రాయల్ సర్కిల్లో రైతుల నిరసన

బళ్లారి సిటీ, జనవరి 26: విద్యుత్ చట్టం 2023ను రద్దుచేసి అన్ని పంటలకు మద్దతుధర కల్పించాలని ఏఐకేకేఎంఎస్ (అఖిల భారత రైతు కృషికార్మికుల సంఘం) డిమాండ్ చేసింది. నగరంలోని రాయల్‌సర్కిల్లో శుక్రవారం రైతులు ఐక్య పోరాటం నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా కర్ణాటక ప్రాంత రైతు సంఘం అధ్యక్షులు శివశంకర్ మాట్లాడుతూ 2021లో ఢిల్లీ సరిహద్దుల్లో రైతుల సమ్మె ప్రపంచానికి కొత్త గుణపాఠం చెప్పిందన్నారు.

పాఠశాలల్లో గణతంత్ర వేడుకలు

బళ్లారిరూరల్, జనవరి 26 : బళ్లారి నగరం, తాలుకాలోని వివిధ గ్రామాలలో గల ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీ చైతన్య అండర్ గ్యాడ్యుయేట్ కాలేజ్, హైస్కూలులో 75వ గణతంత్ర దినోత్సవ పతాకావిష్కరణ కార్యక్రమంలో కళ్యాణ్ కర్ణాటక మాజీ ప్రీంత సేన సంఘం ప్రధాన కార్యదర్శి బీఎన్ ప్రహ్లాద రెడ్డి, ఉపాధ్యక్షులు ఈశ్వరరెడ్డి, సభ్యులు రామాంజినేయులు విద్యార్థులు పాల్గొన్నారు. వివిధ క్రీడలలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు.

బళ్లారిలో ఘనంగా గణతంత్ర వేడుకలు

జయ జయ జయహే!



సుభాష్ చంద్రబోస్ వేషధారణలో చిన్నారి



పోలీసు దళాల గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి



బళ్లారిలోని విమ్స్ మైదానంలో గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న మంత్రి నాగేంద్ర





సాంస్కృతిక కార్యక్రమంలో విద్యార్థినులు



సిరుగుప్ప హైస్కూలు గ్రౌండ్‌లో జాతీయ జెండాను ఎగురవేసిన తహసీల్దార్ విశ్వనాథ



కాంగ్రెస్ కార్యాలయంలో వేడుకలు



జేడీఎస్ కార్యాలయంలో..



కురేకుప్ప పాఠశాలలో గణతంత్ర వేడుకలు



రాఘవ కళా మందిరంలో..



జాతీయ క్రీడల్లో గెలుపొందిన వారికి సన్మానం

భిన్నత్వంలో ఏకత్వం మన ప్రత్యేకత

గణతంత్ర వేడుకల్లో మంత్రి నాగేంద్ర

బళ్లారి, జనవరి 26(ఆంధ్రజ్యోతి): ప్రపంచ దేశాల్లో భిన్నత్వంలో ఏకత్వం కలిగింది ఒక్క భారతదేశం మాత్రమేనని ఇది మనం గర్వించదగ్గ విషయమని బళ్లారి ఇన్‌చార్జి మంత్రి బి. నాగేంద్ర పేర్కొన్నారు. 75వ గణతంత్ర వేడుకల సందర్భంగా బళ్లారిలోని విమ్స్ మైదానంలో శుక్రవారం మంత్రి నాగేంద్ర త్రివర్ణ పతాకం ఎగరవేసి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 1950 జనవరి 26న భారతరాజ్యాంగం అమల్లోకి వచ్చిందని అన్నారు. అనాడు రాజ్యాంగాన్ని రచించిన బి.ఆర్ అంబేడ్కర్‌ను మరిచిపోరాదన్నారు. మన ప్రజాస్వామ్యానికి పునాది మాత్రం చెక్కుచెదరలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం ఐదు పథకాల హామీ ఇచ్చిందని వీటన్నిటినీ అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. గృహజ్యోతి యోజన కింద 2,51,798 మంది లబ్దిదారులు, గృహలక్ష్మి యోజన కింద 2,69,668 మంది, అన్నభాగ్య యోజన కింద 2,61,866 మంది, యువశక్తి కింద, 1,28,43 670 మంది జిల్లాలో లబ్ది పొందారని పేర్కొన్నారు. గణతంత్ర వేడుకల్లో బళ్లారి ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, మేయర్ బి. శ్వేత, డిప్యూటీ మేయర్ జానకి, ప్రజాప్రతినిదులు, అధికారులు డి.సీ ప్రశాంత్ కుమార్ మిశ్రా, డీజీపీ బి.ఎస్ లోకేష్ కుమార్, ఎస్పీ రంజిత్ కుమార్ బండారు. సీఈవో రాహుల్ శరణప్ప సంకనూర్, ఏడీసీ మహ్మద్ జుబేదార్, ఏసీ హేమంత్ కుమార్, ఎస్టీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ సతీష్, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.



హంపీలో కంప్యూటర్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కార్యాలయాల్లో రెపరెపలాడిన మువ్వన్నెల జెండా

బళ్లారి సిటీ, జనవరి 26: నగరంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్, విద్యాసంస్థల్లో శుక్రవారం 75వ గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం కాంగ్రెస్ సమితి అధ్యక్షులు మహ్మద్ రఫిక్ అధ్యక్షతన గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. గాంధీ, అంబేద్కర్ చిత్రపటాలకు నివాళులర్పించి ధ్వజారోహణ గావించారు. ఈసందర్భంగా జిల్లాధ్యక్షులు మహ్మద్ రఫిక్ మాట్లాడుతూ రాజ్యాంగ రచనకు సహకరించిన మహనీయులను స్మరించుకున్నారు. ఈసందర్భంగా జిల్లాకాంగ్రెస్ మారెణ్ణ, కల్లుకంబ పంపాపతి, వెంకటేశ్‌హెగ్డే, అభిలాస్, విల్సన్ కాంతినోవా, ఈరణ్ణ, తాయప్ప, సూర్యనారాయణ, మంజునాథ్, మహానగర పాలిక సభ్యులు ప్రభంజన్‌కుమార్, మించు శ్రీనివాసు, ప్రీతి, రామలింగ, తదితరులు పాల్గొన్నారు. జేడియస్(జనతా దళం) పార్టీకార్యాలయంలో శుక్రవారం పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు సోమలింగనగౌడ వాదిరాజ్‌శెట్టి, పార్టీకార్యకర్తలు పాల్గొన్నారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో అధ్యక్షులు మహారుద్ర గాంధీ, మంజునాథ్, మల్లికార్జునగౌడ, రమేశ్, కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

పథసంచలనంలో పాల్గొన్న బృందాలకు బహుమతులు

బళ్లారి సిటీ, జనవరి 26: విమ్స్ మైదానంలో నిర్వహించిన పథసంచనలో ప్రతిభ కనబరిచిన కవాతు బృందాలకు బహుమతులు ప్రశంస పత్రాలను మంత్రి నాగేంద్ర అందజేశారు. ప్రాథమిక పాఠశాల విభాగంలో చెవిటి, మూగపిల్లల పాఠశాల ప్రథమ స్థానం, ఎంజీఎం ప్రాథమిక పాఠశాల ద్వితీయ స్థానం, బాలభారతి పాఠశాల తృతీయ స్థానం పొందాయి. హైస్కూల్ విభాగంలో సంత్జనర హైస్కూల్(ప్రథమ), సత్య హైస్కూల్(ద్వితీయ), ప్రభుత్వ ఉన్నత పాఠశాల బండిహట్టి(తృతీయ) బహుమతులు గెలుచుకున్నారు. వైఎస్.యోగీశ్, లిపిక, రజనీలక్ష్మ, కునాల్, మహ్మద్ యాసిన్ దీక్షిత్, జాస్మిన్, త్రిపీక, నివేదితలను సన్మానించారు. అనంతరం ముఖ్యమంత్రి యోజన కింద కురుగోడు, మోకా కమ్యూనిటీ హెల్త్ సెంటర్, బళ్లారి హృదయాలయ ఆస్పత్రి, చోరనూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉత్తమ పనతీరు కనబరిచిన ఆరోగ్య సంస్థలకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. అనంతరం షెడ్యూల్డ్ తెగల అభివృద్ధి సంస్థలో గొట్టపు బావులు వేసిన 33మంది లబ్దిదారులకు మోటార్‌పంపులు, విద్యుత్ ఉపకరణాలు పంపిణీ చేశారు.

హోసూరు జోన్

వేడుకగా గణతంత్ర దినోత్సవం



గణతంత్ర దినోత్సవం సందర్భంగా గాంధీజీకి నివాళులర్పిస్తున్న దృశ్యం

హోసూరు జనవరి 26 : హోసూరు కార్పొరేషన్‌లో గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు, హోసూరు కార్పొరేషన్‌లో గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి మేయర్ సత్య అధ్యక్షత వహించి జాతీయ జెండాను ఎగురవేసి స్వీట్లు పంచిపెట్టారు, అనంతరం మున్సిపల్ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రసంగ పోటీలు, వ్యాసరచన పోటీలు, కవితల పోటీలు, భరతనాట్యం నిర్వహించారు, ఈ కార్యక్రమంలో గెలుపొందిన విద్యార్థులకు ఆయన జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమానికి డిప్యూటీ మేయర్ ఆనందయ్య, కమీషనర్ స్నేహా, అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో స్థాయి కమిటీ నాయకులు మాదేశ్వరన్, చెన్నీరప్ప, మండలాధ్యక్షుడు రవి, కౌన్సిలర్లు మంజుళ మునిరాజ్, మోసింతాజ్ నిసార్, వెంకటేశ్, లక్ష్మి, శ్రీనివాసులు, ఎస్.యసస్వినితో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు మురళీధరన్ అధ్యక్షత వహించి మహాత్మాగాంధీకి నివాళులర్పించారు, త్యాగరాజన్, మహదేవన్, జిల్లా మహిళా అధ్యక్షురాలు సరోజమ్మ, మున్సిపల్ ఉపాధ్యక్షుడు గోవర్ధన్, గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఓటరు అవగాహనా ర్యాలీ

హోసూరు జనవరి 26 : హోసూరులో శుక్రవారం 14వ జాతీయ ఓటరు దినోత్సవ అవగాహన ర్యాలీ నిర్వహించారు, హోసూరులోని కామరాజ్ కాలనీ మైదానంలో ప్రారంభమైన ర్యాలీని హోసూరు సబ్ కలెక్టర్ ప్రియంక జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీలో విద్యార్థులు ఓటరు దినోత్సవ అవగాహన బ్యానర్లను పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ ప్రియంక వీధి వ్యాపారులకు, దుకాణదారులకు, ప్రజలకు ఓటు ఆవశ్యకతపై అవగాహన కరపత్రాలు పంపిణీ చేశారు. కామరాజ్ కాలనీ నుంచి ప్రారంభమైన ర్యాలీ కామరాజ్ కాలనీ, తాలూకా ఆఫీస్ రోడ్డు, నేతాజీ రోడ్డు, చెరువువీధి, సహ నగరంలోని ప్రధాన రహదారుల గుండా సాగి చివరకు హోసూరు సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ఆపారు. డప్పులు వాయిస్తూ, కోలాటం, నృత్యాలు, చేస్తూ అవగాహన కల్పించారు,

5 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్

హోసూరు(సిప్‌కాట్) జనవరి 26 : గణతంత్ర దినోత్సవం తర్వాత రెండు రోజులు సెలవులు కావడంతో కర్ణాటక రాష్ట్రం నుంచి తమిళనాడుకు పెద్ద సంఖ్యలో జనం వస్తుండగా తమిళనాడు హైవేపై భారీగా ట్రాఫిక్ స్తంభించింది. వరుసగా సెలవులు కావడంతో ట్రాఫిక్ రద్దీ ఏర్పడింది. అదే విధంగా చెన్నై జాతీయ రహదారిపై శుక్రవారం భారీ సంఖ్యలో వాహనాలు వెళ్లడంతో హోసూరు సిప్‌కాట్, జూజూవాడీ ప్రాంతాల్లో జాతీయ రహదారిపై ట్రాఫిక్ జామ్ ఏర్పడింది, దీంతో వాహనాలు ఒకటి కొకటి తగులుతూ వెళ్లడంతో వాహనదారులు నానా అవస్థలు పడ్డారు. విషయం తెలుసుకున్న సిప్‌కాట్ పోలీసులు ట్రాఫిక్ విభాగం పోలీసులు ఈ ప్రాంతంల్లో ట్రాపిక్‌ను క్రమబద్దీకరించారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్ర సరిహద్దులోని రహదారిపై సుమారు 5 కిలోమీటర్ల దూరం వాహనాలు రద్దీ ఏర్పడింది.



ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ప్రాధాన్యం



సమావేశంలో ప్రసంగిస్తున్న మంత్రి డాక్టర్ శరణు ప్రకాశ్ పాటిల్

రాయచూరు జనవరి 26 : సిద్ధరామయ్య నేతృత్వంలోని రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తొలి ప్రాధాన్యతనిస్తుందని రాష్ట్రవైద్యకీయ విద్యశాఖ, జిల్లా ఇంచార్జ్ మంత్రి డాక్టర్ శరణు ప్రకాశ్ పాటిల్ అన్నారు. 75వ గణతంత్ర దినోత్సవన్ని పురస్కరించుకుని శుక్రవారం నగరంలోని మహాత్మగాంధి క్రీడామైదానంలో జాతీయ జెండాను ఎగరవేసి మంత్రి ప్రజలు రిపబ్లిక్ దినోత్సవ శభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి, ఫిబ్రవరి నెలలో భారీ ఉద్యోగ మేళ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే వివకుమార్‌ల నేతృత్వంలో నిర్వహించే ఉద్యోగ మేళలో నిరుద్యోగ యువతి-యువకులకు తగిన ఉపాధి ఉద్యోగ అవకాశాలు లభించే విధంగా కార్యక్రమాలు చేపడుతామన్నారు. రాష్ట్రానికి ఏయిమ్స్ ఏర్పాటు కోసం ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి నివేదించామని మంజూరు లభించిన వెంటనే ఆ ఏయిమ్స్ కేంద్రాన్ని రాయచూరులో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కాగా కల్యాణ-కర్ణాటక ప్రాంతంలోని నిరుద్యోగులకు మేలు జరిగేలా 371(జే) ఆర్టికల్‌కు సంబంధించి కొన్ని సవరణలు చేయనున్నట్లు మంత్రి తెలిపారు.

గద్వాల రోడ్డులో ఒరిగిన ధాన్యం లారీ : రాకపోకలకు అంతరాయం



రాయచూరు జనవరి 26 : నగరంలో నెలల తరబడిగా సాగుతున్న గద్వాల రోడ్డు మరమ్మతు పనులు వాహనదారులకు తీవ్ర అసౌకర్యంగా మారాయి. ఇప్పటికే పలు సార్లు ఈ మార్గంలో వాహనాలు ఒరిగిపోవడం, బోల్తాగొట్టడం లాంటి సంఘటనలు జరిగాయి. గుంతలమయంగా మారిన ఈ రోడ్డులో శుక్రవారం ఓ ధాన్యం లారీ ఒక్కసారిగా ఒరిగి పోవడంతో లోడ్ చేసిన ధాన్యం సంచులు రోడ్డుపై చిందరవందరగా పడిపోయాయి. దీంతో ఈ మార్గంలో వాహన సంచారం నిలిచిపోయింది.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంచ్...

మోజార్ట్ (జయంతి)



మోజార్ట్ 1756 జనవరి 27న హోలీ రోమన్ సామ్రాజ్యంలోని సాల్జ్‌బర్గ్‌లో జన్మించారు. పాశ్చాత్య సంప్రదాయ సంగీతంలో పేరొందారు. కీ బోర్డు, వయోలిన్‌పై ప్రతిభ చాటారు. ఐదేళ్ల వయసునుంచే సంగీతం స్వరపరచడం, రాజకుటుంబీకుల ముందు ప్రదర్శనలు చేశారు. 17ఏళ్లకు సాల్జ్‌బర్గ్ కోర్టులో సంగీతకారుడయ్యారు. వియన్నాలో స్థిరపడ్డా కీర్తి దక్కిందికానీ ఆర్థికంగా నిలదొక్కుకోలేదు. చివరి సంవత్సరాలలో సింఫనీ, కానెసెర్టో, ఒపెరాలు స్వరపరిచాడు. 600కు పైగా సంగీత కళాఖండాలను స్వరపరిచారు. 35ఏళ్లకే 1791 డిసెంబరు 5న కన్నుమూశారు.

ఇంగ్‌వర్ కాంప్రాడ్ (వర్ధంతి)



అంతర్జాతీయంగా పేరొందిన ఐకియా సంస్థ సంస్థాపకుడు ఫియోడర్ ఇంగ్‌వర్ కాంప్రాడ్ 1926 మార్చి 30న జన్మించారు. స్వీడిష్ దేశానికి చెందిన వ్యాపార దిగ్గజం. ఫర్నీచర్ రంగంలో విప్లవాత్మక మార్పులు సాధించారు. తన జీవితంలోని ఒడిదుడుకులు, విజయాలతో కూడిన 'ఏ ట్రీట్‌మెంట్ ఆఫ్ ఏ ఫర్నీచర్ డీలర్' పుస్తకాన్ని రచించారు. 91వ యేట 2018 జనవరి 27న కన్నుమూశారు.

నిఖిల్ బెనర్జీ (వర్ధంతి)




'పద్మభూషణ్' గ్రహీత పండిట్ నిఖిల్ రంజన్ బెనర్జీ 1931 అక్టోబరు 14న కోల్కత్తాలో జన్మించారు. మైహర్ ఘరానా శైలిలో క్లాజికల్ సితార్ వాదకులుగా పేరొందారు. 20వ శతాబ్ధంలో పేరొందిన రవిశంకర్, విలయత్ ఖాన్‌ల తర్వాత ఆ స్థాయిలో పేరొందారు. సితార్‌లో బాబా అల్లావుద్దీన్ ఖాన్ వద్ద శిక్షణ పొంది 9వ యేటకే ఆలిండియా రేడియోలో సితార్ కళాకారుడిగా చేరారు. సంగీత నాటక అకాడమీ తదితర అవార్డులు పొందారు. 1986 జనవరి 27న కన్నుమూశారు.

మతగ్రంథాలన్నింటికంటే రాజ్యాంగమే గొప్పది

బెంగళూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): భారతదేశ రా జ్యాంగం అన్ని మతగ్రంథాలకంటే పరమ పవిత్రమైనదని మాజీ ఉపముఖ్యమంత్రి డాక్టర్ సీఎన్ అశ్వత్థ నారాయణ పేర్కొన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మల్లేశ్వరంలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. రాజ్యాంగ పరిరక్షణకు ప్రధాని మోదీ పెద్దపీట వేస్తున్నారని ఆయన కొనియాడారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను కాంగ్రెస్ అవమానించగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆయనకు సముచిత గౌరవాన్ని కల్పించిన సంగతిని గుర్తు చేశారు. రాజ్యాంగాన్ని మారుస్తామంటూ తమపై దుష్ప్రచారం చేస్తున్నారని, వీటిని విశ్వసించవద్దని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సునిల్‌కుమార్‌తోపాటు పార్టీ సీనియర్ నేతలు జీవీ రాజేశ్, చలవాది నారాయణస్వామి, దినకరశెట్టి, ఎండీ లక్ష్మీనారాయణ, శంకర గౌడ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

పరిటాల రవికి ఘన నివాళులు



నివాళులు అర్పిస్తున్న పరిటాల యువసైన్యం సభ్యులు

బొమ్మనహళ్ళి, జనవరి 26: స్థానిక బేగూరు ప్రాంతంలోని సుమ్మనహళ్ళిలో రిపబ్లిక్ డే, పరిటాల రవి వర్ధంతిని పురస్కరించుకుని అనాథాశ్రమంలో పరిటాల యువసైన్యం బెంగళూరు ఆధ్వర్యంలో శుక్రవారం పాలు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సురేంద్ర, ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ప్రతాప్, ఓబులేశ్, చిన్న చిన్నప్ప, నరసింహులు, ముత్యాలప్ప, మారప్ప, రామాంజినేయులు, నాగేశ్ పాల్గొన్నారు.

పుట్టణ్ణయ్యకు బీ ఫారం అందజేత

బెంగళూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థిగా విద్యావేత్త కేఎస్ పుట్టణ్ణయ్యకు బీఫారం అందించారు. శుక్రవారం సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్‌లనుంచి బీ ఫారం పొందారు. పుట్టణ్ణయ్య కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మెల్సీ అభ్యర్థిగా రంగంలోకి దిగడం ద్వారా మూడు పార్టీల నుంచి పోటీ చేసినట్టయ్యింది. తొలుత జేడీఎస్ ద్వారా ఆపై బీజేపీ ద్వారా గెలిచిన సంగతి విదితమే.

దేశభక్తిని మెండుగా పెంపొందించుకుందాం



టాపర్‌గా నిలిచిన విద్యార్థిని పద్మావతికి అభినందనలు



సర్జాపురలో గౌరవవందనం స్వీకరిస్తున్న ప్రముఖులు



పతాక అవిష్కరణ కార్యక్రమంలో ఎంబీ మోజెస్



జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

» వాడవాడలా ఘనంగా గణతంత్ర వేడుకలు

బెంగళూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): దేశభక్తిని పెంపొందించుకోవడం పౌరులందరి ఏకైక లక్ష్యం కావాలని చిక్‌పేట ఎమ్మెల్యే ఉదయ్‌గరుడాచార్ పిలుపునిచ్చారు. బెంగళూరులోని తన కార్యాలయంలో శుక్రవారం గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసంగించిన ఆయన భారత దేశం పట్ల ప్రపంచవ్యాప్తంగా గౌరవం బాగా పెరిగిందని ఇందుకు కేంద్రంలోని మోదీ సుపరిపాలన, అర్థవంతమైన విదేశాంగ విధానం కారణమన్నారు. గరుడా ఫౌండేషన్ అధినేత్రి మేదిని ఉదయ్ గరుడాచార్, బీజేపీ సీనియర్ నేతలు పీఎస్ సదాశివ, బీబీఎంపీ మాజీ కార్పోరేటర్లు, చిక్‌పేట శాసనసభ నియోజకవర్గానికి చెందిన ప్రముఖ నేతలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకోసం ప్రతిజ్ఞ చేద్దాం

బెంగళూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ పరిరక్షణ కోసం దేశప్రజలంతా మతాలు కులాలకు అతీతంగా ప్రతిన బూనాలని రెవరెండ్ ఎంబి.మోజెస్ పిలుపునిచ్చారు. రామచంద్రపురం తెలుగు బాప్టిస్ట్ చర్చిలో శుక్రవారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆయన జాతీయ పతాకాన్ని అవిష్కరించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో హాజరైన తెలుగు క్రైస్తవులను ఉద్దేశించి ప్రసంగించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు దేశ ప్రజలందరికీ పరిపూర్ణంగా అందాలని అప్పుడే గణతంత్ర లక్ష్యం నెరవేరనుందన్నారు.

దేశభక్తి, నైతిక విలువలతోనే విద్యార్థి జీవితానికి పరిపూర్ణత

బెంగళూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): దేశభక్తి, నైతిక విలు వలతోనే విద్యార్థి జీవితానికి పరిపూర్ణత లభిస్తుందని సేవా భారత్ ట్రస్టు అధ్యక్షుడు బండి ఆదినారాయణ రెడ్డి పేర్కొన్నారు. బెంగళూరు వివేక్‌నగర్‌లోని ప్రభుత్వ తెలుగు ఉన్నత పాఠశాలలో శుక్రవారం గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. దశాబ్దాన్నర కాలంగా వివేక్‌నగర్ ప్రభుత్వ తెలుగు ఉన్నత పాఠశాల, తెలుగు ప్రాథమిక పాఠశాల, కన్నడ, తమిళ పాఠశాలలను పూర్తిగా సేవా భారత్ ట్రస్టు దత్తత తీసుకుని విద్యార్థులకు అవసరమైన సదుపాయాలను కల్పిస్తోందన్నారు. 2023లో జరిగిన ఎస్‌ఎస్‌ఎల్‌సి పరీక్షల్లో వివేక్ నగర్ ప్రభుత్వ తెలుగు ఉన్నత పాఠశాలలో టాపర్‌గా నిలవడమే కాకుండా ద్వితీయ భాష కన్నడలో 100 శాతం మార్కులు సాధించిన ఆర్.పద్మావతిని వేదికపై నగదు పురస్కారంతో ఘనంగా సన్మానించారు. ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైన విద్యార్థినులు పి.మౌనిక, ఎం.జీవితలకు కూడా నగదు పురస్కారం అందజేసి అభినందించారు. ఒక వేళ వీరు ప్రభుత్వ కళాశాలల్లో చదువుకునేందుకు సిద్ధపడితే అవసరమైన ఫీజును కూడా తానే భరిస్తానని బండి ఆదినారాయణ రెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పాఠశాల ఉపాధ్యాయ బృందంతోపాటు విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు రంగస్వామి నాయుడు తదితరులు ఈ సందర్భంగా హాజరయ్యారు.

ఘనంగా గణతంత్ర వేడుకలు

మహదేవపుర, జనవరి 26: 75వ గణతంత్ర దినోత్సవాన్ని కేఆర్‌పుర రాజీవ్‌గాంధీ క్రీడా మైదానంలో శుక్రవారంగా ఘనంగా జరిగాయి. బెంగళూరు తూర్పు తాలూకా తహసీల్దార్, జాతీయ పండగుల ఆచరణ సమితి అధ్యక్షుడు రవి జాతీయపతాకాన్ని ఎగురవేశారు. ఎమ్మెల్యే బైరతి బసవ రాజ్, తహసీల్దార్ రవిలు పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఎంతోమంది మహనీయుల పోరాటం, ప్రాణత్యాగ ఫలితంగా స్వాతంత్ర్యం లభించిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. స్వాతంత్ర్యానంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నేతృత్వంలో రూపొందిన రాజ్యాంగానికి 1950 జనవరి 26న ఆమోదం లభించిందన్నారు. ప్రజల శాంతియుత జీవనానికి రాజ్యాంగమే కారణమన్నారు. విద్యార్థుల పథ సంచలనం, సాంస్కృతిక కార్యక్రమాలు అలరిచాయి. వివిధ రంగాల సాధకులను ఆత్మీయంగా సత్కరించారు. ఈఓ వసంత్‌కుమార్, బీఈఓ రామమూర్తి, టీహెచ్ఓ కోమల, స్థానిక ప్రముఖులు ఆంటోణి స్వామి, శివప్ప, భట్టరహళ్ళి మంజు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలి

దొమ్మసంద్ర, జనవరి 26: దేశంలో శాంతి సమానత్వంతో జీవించేందుకు రాజ్యాంగమే కారణమని, గొప్ప దేశ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ రాజ్యాంగాన్ని గౌరవించాలని సర్జాపుర గ్రామపంచాయతీ ఉపాధ్యక్షుడు ఏ సతీశ్‌కుమార్ అభిప్రాయపడ్డారు. సర్జాపుర పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ క్రీడా మైదానంలో 75వ గణతంత్ర దినోత్సవంలో జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. మన రాజ్యాంగం ప్రపంచంలోనే ప్రత్యేక గుర్తింపు కలిగిందన్నారు. తొలుత పుర వీధులలో భరతమాత, స్వాతంత్ర్య పోరాట నేతల భావ చిత్రాలతో ఊరేగించారు. మైదానంలో వివిధ పాఠశాలల విద్యార్థుల పథ సంచలనం, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సర్జాపుర గ్రామపంచాయతీ అధ్యక్షురాలు సునిత శశిధర్, మాజీ అధ్యక్షుడు వై శ్రీరాములు, రిటైర్డు టీచర్ వీ రామకృష్ణ, బీవీ బాలరాజు, బీఎస్ మంజుళ, పంచాయతీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

బాగేపల్లిలో...

బాగేపల్లి, జనవరి 26: పట్టణం సహా తాలూకా వ్యాప్తంగా 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఉత్సాహంగా సాగాయి. పట్టణంలోని మజీద్-ఏ-ఖమర్‌లో ప్రతి ఏడాదిలాగే ఈసారి కూడా జాతీయజెండాను ఎగురవేశారు. శుక్రవారం మసీదు పెద్దలు, స్థానిక హిందువులు, క్రైస్తవులు అందరూ పాల్గొని జాతీయజెండాను ఎగురవేశారు. జైభారత్‌మాతా నినాదాలు మారుమోగాయి. స్థానిక సుబ్రమణ్య స్వామి దేవాలయం మురళి, పాస్టర్ ప్రకాశ్‌తోపాటు మసీదు పెద్దలు పాల్గొన్నారు.

హొంగసంద్రలో గణతంత్ర వేడుకలు

బొమ్మనహళ్ళి, జనవరి 26: హొంగసంద్రలోని ఐఎన్‌టీయూసీ కట్టడ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీజీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించి పతాకాన్ని ఎగురవేశారు. కార్మిక సంఘం అధ్యక్షుడు శ్యామణ్ణరెడ్డి మాట్లాడుతూ 75వ గణతంత్ర వేడుకలు నిర్వహిస్తున్నామంటే ఎంతోమంది మహనీయుల పోరాటం, త్యాగ ఫలితమే సంపూర్ణ స్వాతంత్ర్యం సాధ్యమైందన్నారు. స్వాతంత్ర్యం లభించి దశాబ్దాలు గడిచినా బడుగు బలహీన వర్గాల ప్రజల జీవితాలలో మరింత మార్పు రావాల్సి ఉందన్నారు. దాస్, విజయ, సోమణ్ణ, శరవణ్‌కుమార్, శివాచారి తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం సేవా సమితి ఆధ్వర్యంలో...

డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం సేవా సమితి ఆధ్వర్యంలో జయదేవ ఆసుపత్రి ఆవరణలో సంస్థ డైరెక్టర్ డాక్టర్ సీఎన్ మంజునాథ్ నేతృత్వంలో మొక్కలు నాటారు. మనుష్యులు, పశుపక్ష్యాదులు ఆరగించేలా యోగ్యమైన పండ్లు అందించే మొక్కలు నాటుతున్న తెలిపారు. తొలుత జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. కార్యక్రమంలో అబ్దుల్‌కలాం సేవా సమితి రాష్ట్ర అధ్యక్షురాలు శాలినిగిరి, ఆసుపత్రి వైద్యులు సిబ్బంది, సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



కేఆర్‌పురలో గణతంత్ర వేడుకల్లో ప్రముఖులకు సన్మానం



శిడ్లఘట్టలో గణతంత్ర వేడుకలు



హొంగసంద్రలో ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో..



బాగేపల్లిలో గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న స్థానికులు

క్రీడలతో మానసిక వికాసం

బెంగళూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక వికాసం, యోగాతో ఆరోగ్య సంరక్షణ సాధ్యమని ఆదిచుంచనగిరి మఠాధిపతి డాక్టర్ నిర్మలానంద నాథస్వామిజీ పేర్కొన్నారు. బీజీఎస్ క్రీడా వైభవ్ కార్యక్రమానికి హాజరైన ఆయన ఈ సందర్భంగా ప్రసంగిస్తూ భారత క్రీడాకారులు అన్ని రంగాలలోనూ దేశ విదేశాలలో చక్కగా రాణిస్తున్నారని కొనియాడారు. అంతకు ముందు స్పోర్ట్స్ గ్లోరీ 2024 కు శ్రీకారం చుట్టిన కర్ణాటక రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి సంతోష్ మీనన్ క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించారు. ఐపీఎస్ అధికారి రవికాంతేగౌడ, బీజీఎస్, ఎస్‌జేపీ గ్రూప్ విద్యాసంస్థలు, ఆసుపత్రుల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ప్రకాశ్‌నాథస్వామిజీ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో బ్యాడ్మింటన్ క్రీడాకారిణి శ్రీశిత, క్రికెటర్ డీ గణేశ్, రవిచేతన్ అతిథులుగా హాజరయ్యారు.



ప్రముఖులను సత్కరిస్తున్న డాక్టర్ నిర్మలానంద నాథస్వామిజీ

రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలి



అంబేద్కర్ చిత్ర పటానికి నివాళులర్పిస్తూ..

బెంగళూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు హక్కులు కల్పిస్తూ ప్రపంచంలో మరెక్కడా లేని విధంగా అద్భుతమైన రాజ్యాంగాన్ని భారత రత్న డా. బాబా సాహెబ్ అంబేద్కర్ రూపొందించారని దీనిని భావితరాలకోసం పదిలంగా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిపౌరుడిపైనా ఉందని కర్ణాటక తెలుగు ప్రజాసమితి పేర్కొంది. బెంగళూరులోని కల్యాణ్‌నగర్‌లో శుక్రవారం ఆయన గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం బాబా సాహెబ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ భారత రాజ్యాంగాన్ని మార్చేస్తామని కొన్ని శక్తులు పదే పదే పేర్కొం టున్నాయని ఈ నేపథ్యంలో దీన్నికంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన అవసరం ఉందని బొందు రామస్వామి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన సమ యంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. హామీలను అమలు చేయకుండా కేంద్రం ఆంధ్రప్రదేశ్ ప్రజలను మోసగించిందన్నారు. ఆంధ్ర పాలకులు తమ వ్యక్తిగత స్వలాభాల కోసం ప్రత్యేక హోదా, విభజన హామీలపై నోరు మెదపడం లేదని ఆయన వ్యాఖ్యానించారు. ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు వంటి డిమాండ్‌లతో జరుగుతున్న ప్రజా పోరాటాలకు డా.బొందు తమ సంఘీభావం ప్రకటించారు. ప్రధాని నరేంద్ర మోదీ తక్షణం ఈ అంశంపై జోక్యం చేసు కోవాలని ఏపీ శాసనసభ ఎన్నికలకు ముందే వీటిపై స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. సమితి పదాదికారులతో పాటు స్థానిక పాఠశాల విద్యార్థులు హాజరయ్యారు.

యువత జీవితంలో క్రీడలు భాగం కావాలి

బెంగళూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): యువత జీవితంలో క్రీడలు ఒక భాగం కావాలని మానసిక పరివర్తనకు ఇవి ఎంతగానో దోహదపడతాయని యువజన కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఎస్ రక్షా రామయ్య పేర్కొన్నారు. దాసనపురలో మూడు రోజుల డీకే క్రష్ క్రికెట్‌లీగ్ 2024ను బ్యాటింగ్ చేయడం ద్వారా శుక్రవారం లాంచనంగా ప్రారంభించారు. గెలుపు ఓటమి అనుభవాలను క్రీడలు మనకు నేర్పుతాయని వీటిని నిజజీవితంలోనూ మనం అలవరుచుకోవాలన్నారు. గెలుపునకు పొంగిపోకుండా, ఓటమికి కుంగిపోకుండా ధ్రుడచిత్తంతో ముందుకు సాగాలన్నారు. చిక్కబళ్లాపురంలోని వివిధ ప్రాంతాలనుంచి ఈ పోటీల్లో పాల్గొంటున్న జట్టు సభ్యులను అంతకుముందు పరిచయం చేసుకున్నారు. ఈ పోటీలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న రక్షా రామయ్య

రాయణ్ణ దేశభక్తి ఆదర్శం

బెంగళూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): బ్రిటీష్‌వారిపై పోరాటం చేసిన క్రాంతి వీర సంగొళ్ళి రాయణ్ణ దేశభక్తి ఆదర్శమని సీఎం సిద్దరామయ్య కొనియాడారు. రాయణ్ణ వర్ధంతిని పురస్కరించుకుని మెజస్టిక్‌లోని విగ్రహానికి పూలమాల సమర్పించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ దేశప్రేమికుడు రాయణ్ణను కొందరు కుట్రతో బ్రిటీష్‌వారికి పట్టించారన్నారు. కురుబ సామాజిక వర్గానికి చెందినవారని కాకుండా రాయణ్ణ దేశభక్తిని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలన్నారు. సమాజంలో మార్పుకోసం ప్రతి ఒక్కరూ అంకితభావంతో వ్యవహరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆదిచుంచనగిరి మఠాధిపతి నిర్మలానందనాథ స్వామిజీ, హెచ్‌ఎం రేవణ్ణతోపాటు పలువురు పాల్గొన్నారు.

యోగిరాజ్‌కు సుత్తూరు మఠాధిపతి ఆశీస్సులు



స్వామిజీ ఆశీస్సులు పొందుతున్న యోగిరాజ్ కుటుంబం

బెంగళూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలో ప్రతిష్ఠించిన రామ్‌లల్లా విగ్రహ రూపకర్త శిల్పి అరుణ్ యోగిరాజ్‌ను సుత్తూరు మఠాధిపతి శివరాత్రి దేశి కేంద్ర స్వామిజీ అభినందించారు. శుక్రవారం చాముండి కొండల్లోని సుత్తూరు మఠానికి వెళ్లిన యోగిరాజ్ కుటుంబీకులకు ప్రత్యేకంగా ఆశీస్సులు అందించారు. రామ్ లల్లా విగ్రహం అద్భుతంగా ఉందని స్వామిజీ కొనియాడారు.

ఘనంగా రామలింగేశ్వరస్వామి బ్రహ్మరథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

శిడ్లఘట్ట, జనవరి 26: తాలూకాలోని నల్లరాళ్ళహళ్ళి సమీపాన గల రామలింగేశ్వర కొండపై కొలువైన స్వామివారి బ్రహ్మరథోత్సవం గురువారం ఘనంగా జరిగింది. తహసీల్దార్ బీఎన్ స్వామి లాంచనంగా ప్రారంభించారు. ఆలయాన్ని పుష్పాలతో అందంగా అలంకరించారు. ఉత్సవమూర్తిని రథంపై కొలువుదీర్చి ఊరేగించారు. భక్తులు ఉత్సాహంగా పాల్గొని రథంపై అరటిపండ్లు వేసి మొక్కులు తీర్చుకున్నారు. పురాణాల కథనం ప్రకారం శ్రీరాముడు వనవాసకాలంలో స్థాపించిన ఈశ్వరుడే రామలింగేశ్వర ఆలయంగా ప్రసిద్ధి చెందిందని తెలుస్తోంది. అనంతరం చోళులకాలం నాటి శిల్పాలు ఇక్కడ చరిత్రకు నిదర్శనంగా ఉన్నాయి. ఉత్సవంలో భాగంగా పెద్దసంఖ్యలో దుకాణాలు వెలిశాయి. చిన్నారులు ఉత్సాహంగా తమకు ఇష్టమైన బొమ్మలు కొనుగోలు చేశారు. కాగా కొండపై భక్తుల సౌకర్యార్థం నిర్మించిన భోజనశాలను సమాజసేవకుడు పుట్టు ఆంజినప్ప ప్రారంభించారు. ఉత్సవంలో మంత్రి కేహెచ్ మునియప్ప, ఎమ్మెల్యే రవికుమార్, కాంగ్రెస్ నాయకుడు రాజీవ్‌గౌడ, గౌడనహళ్ళి మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటిన రాజ్యాంగం



ముఖ్యఅతిథిని సన్మానిస్తున్న రుక్మాంగదనాయుడు

బెంగళూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటుతూ రామాయణం, మహాభారతంలాగే అత్యంత పవిత్రమైనదని ప్రముఖ వైద్య, విద్యానిపుణుడు డాక్టర్ టీహెచ్ ఆంజనప్ప పేర్కొన్నారు. బెంగళూరు బనశంకరిలోని శ్రీకృష్ణ గ్రూప్ విద్యాసంస్థల ప్రాంగణంలో శుక్రవారం ఆయన గణతంత్ర దినోత్సవాల సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ రాజ్యాంగం ప్రతిపాదించిన విలువలను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. ఇదే సందర్భంగా విద్యార్థులకు పలు ఆరోగ్య సంరక్షణ సూచనలు చేశారు. ప్రతిరోజూ రెండున్నర లీటర్ల నీటిని చాటాలని, కనీసం అరగంటసేపు వ్యాయామం చేయాలని సూచించారు. శ్రీకృష్ణ గ్రూప్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎం రుక్మాంగదనాయుడు మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అతి పెద్దదన్నారు. కార్యక్రమంలో గ్రూప్ ఉపాధ్యక్షురాలు జలజాక్షమ్మ, ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్‌పీ మనోహర్, పీజీ విభాగం డైరెక్టర్ ప్రొఫెసర్ వేణుగోపాల్, వివిధ విభాగాల ప్రిన్సిపాల్స్ కమల సుగంధి, డాక్టర్ ఎన్ ఉషా కుమారి, ప్రొఫెసర్ చెంగప్ప, డాక్టర్ గోపాల్, ప్రొఫెసర్ మంజునాథ్, పెద్దసంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి 9 'పద్మ' పురస్కారాలు

» ఒకరికి పద్మభూషణ్, 8 మందికి పద్మశ్రీ

బెంగళూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వివిధ విభాగాలలో సేవలందిస్తున్న ప్రముఖులకు 9 పద్మ పురస్కారాలు వరించాయి. వీరిలో జిందాల్ పారిశ్రామికవేత్త సీతారాంకు పద్మ భూషణ్ పురస్కారం దక్కింది. విద్య, సాహిత్య విభాగంలో ఎంకే శ్రీధర్‌కు, క్రీడల విభాగంలో రోహన్ బోపణ్ణ, కళల విభాగం అనుపమా హొసకెరె, వైద్యరంగంలో ప్రేమా ధన్‌రాజ్, చంద్రశేఖర్ చెన్నపట్టణ రాజణ్ణచార్, సామాజిక సేవా విభాగంలో కేఎస్ రాజణ్ణ, వ్యాపార పారిశ్రామిక రంగంలో శశి సోనితోపాటు సామాజిక సేవా రంగం ద్వారా సోమణ్ణకు పద్మశ్రీ పురస్కారాలు దక్కాయి.

రాజ్యోత్సవం తప్పింది.. పద్మశ్రీ దక్కింది

మైసూరు, మండ్య, చామరాజనగర జిల్లాల పరిధిలో ఆదివాసీల అభివృద్ధి, అటవీప్రాంతాల్లో నివసించే తెగలకు సాధారణ జీవనం సాగించేలా మార్పుకోసం ప్రయత్నించిన మైసూరు జిల్లా హెచ్‌డీ కోట తాలూకా మొత్తహాడి సోమణ్ణకు అరుదైన పద్మశ్రీ వరించింది. రాష్ట్ర ప్రభుత్వం 2016లో రాజ్యోత్సవ పురస్కారానికి ఎంపిక చేసి ఒకరోజులోనే జాబితానుంచి సోమణ్ణ పేరును తప్పించారు. అందుకు సాహితీవేత్తలు విమర్శకులు దేవనూరు మహదేవ సమక్షంలో సోమణ్ణకు లక్ష రూపాయల నగదు, జనరాజ్యోత్సవ పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఇటీవలే వాల్మీకి పురస్కారాన్ని అందుకున్నారు. ఇదే సందర్భంలోనే సీఎం సిద్దరామయ్య అప్పట్లో రాజ్యోత్సవం తప్పిందని అయినా వాల్మీకి పురస్కారంతో సత్కరించడం సంతోషమని ప్రకటించారు. అంతలోనే ఏకంగా పద్మశ్రీ పురస్కారాన్ని పొందారు. విద్యాభ్యాసం లేకున్నా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలలో ఆదివాసీల అభివృద్ధి కోసం నిరంతరంగా పని చేశారు. అటవీప్రాంతాలలో రెస్టారెంట్‌లు, రిసార్టుల నిర్మాణానికి వ్యతిరేకంగా పోరాటం చేయడం ద్వారా లక్ష్యాన్ని సాధించారు. నర్మదా బచావో పోరాటంలో మేధాపాట్కర్‌తో కలసి పాల్గొన్నారు. 2008లో అమలైన ఆదివాసీల పారంపర్య హక్కుల సమితిలో నిరంతరగా సేవలందిస్తున్నారు. 1991లో ఫిలిప్పీన్స్‌లో జరిగిన ఆదివాసీల మేళాలో కర్ణాటక ఆదివాసీల తరపున భాగస్వామ్యులయ్యారు. ఈనెల 7న భార్య రాజమ్మ మృతి చెందగా విషాదంతో ఉన్న సోమణ్ణకు అత్యున్నతమైన పురస్కారం దక్కింది. భార్య ఉంటే మరింత సంతోషపడేవారని సోమణ్ణ అభిప్రాయపడ్డారు.



సీతారాం జిందాల్

విద్యారంగంలో అత్యున్నత సేవలు.. ఎంకే శ్రీధర్

ఎంకే శ్రీధర్ అనంతపురం జిల్లా హిందూపురం వాసి. మైసూరు యూనివర్సిటీలో ఫిలాసఫీలో డాక్టరేట్ పూర్తి చేసి విజయా కాలేజీలో కామర్స్ అధ్యాపకుడిగా వృత్తి జీవనాన్ని ఆరంభించారు. అనంతరం కెనరాబ్యాంక్ స్కూల్ ఆఫ్ మేనేజిమెంట్ స్టడీస్‌లో ప్రొఫెసర్ అండ్ డీన్‌గా వ్యవహరించారు. ఎంఫిల్‌తోపాటు 11 పీహెచ్‌డీ స్కాలర్స్‌ను పొందిన ఆయన 30కుపైగా పరిశోధనలు ప్రచురితమయ్యాయి. సామాజిక సేవల ద్వారా ఆయన జాతీయ అంశాలపై పోరాటం చేశారు. సహస్రపాది అనే పుస్తకాన్ని రచించారు. కర్ణాటక రాజ్యోత్సవ అవార్డుతోపాటు ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అసోసియేషన్ నుంచి గోల్డ్ మెడల్ పొందారు. కర్ణాటక నాలెడ్జ్ కమిషన్ మెంబర్ సెక్రటరీగాను, కర్ణాటక స్టేట్ ఇన్నోవేషన్ కౌన్సిల్ సభ్యుడిగాను, కర్ణాటక సెంట్రల్ అడ్వైజరీ బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్ సభ్యుడిగాను, నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ కమిటీ సభ్యుడిగాను వ్యవహరించారు. కేరళ సెంట్రల్ యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్‌గాను, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఉపాధ్యక్షుడిగాను, సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ అండ్ సోషల్ స్టడీస్ ప్రెసిడెంట్‌గా సేవలందించారు. చాణక్య యూనివర్సిటీ ఫౌండర్ చాన్స్‌లర్‌గా ఎంకే శ్రీధర్ వ్యవహరిస్తున్నారు. కాగా పద్మ భూషణ్, పద్మశ్రీ పురస్కారాలకు ఎంపికైనవారిని స్థానికంగా ఉన్న సంఘాలు ప్రత్యేకంగా సత్కరించేందుకు కార్యాచరణ చేపట్టాయి. రాష్ట్రానికి 9 పద్మ పురస్కారాలు దక్కడంపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది.



అనుపమా హొసకెరె, చంద్రశేఖర్, ఎంకే శ్రీధర్



సోమణ్ణ, ప్రేమా ధనరాజ్, రోహన్ బోపణ్ణ